# శ్యామాశ్వమహాల్ని

డాక్టర్ సి. రంగనాథన్

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

వేదకథాభారతి - 18

# శ్యావాశ్వమహర్షి

రచన

డాక్టర్ సి. రంగనాథన్

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఐ. ఏ. ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 18

**SYAVASVA MAHARSHI**

by

***Dr. C. Ranganathan***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Laser typeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్ ,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -


**ఈ వేద కథా భారతి.**

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ



# మనవి

వేద కథాభారతి.


అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# శ్యావాశ్వ మహర్షి

శ్యావాశ్వుడు వేదకాలంనాటి ఋషి. ఇతని ప్రస్తావన అత్రి, అర్చనానస, శ్యావాశ్వ త్రయార్షేయ అని చెప్పబడు ఆత్రేయ గోత్రంలో కనిపిస్తుంది.

సుగుణాలు మెచ్చిన వాడుగా, మహిమాన్వితమైన మంత్రద్రష్టగా, మహీపతి రథవీతి మనసు రంజించిన వ్యక్తిగా, మహారాణి మెప్పుపొందిన జామాతగా, తల్లిదండ్రుల గారాబు బిడ్డగా, వేదాధ్యయన తత్పరుడుగా, యాగనిర్వహణకుశలుడుగా, ఆశ్రమవాసులకు తలమానికంగా ప్రకాశించిన మహర్షి శ్యావాశ్వుడు. అత్రిమహర్షి మనుమడు, అర్చనానసుని కుమారుడు.

శ్యావాశ్వుడు ఋగ్వేదంలోను, అథర్వవేదంలోను, శతపథ బ్రాహ్మణంలోను, పంచవింశతి బ్రాహ్మణంలోను, బృహద్దేవతలోను, శాంఖాయన శ్రౌతసూత్రంలోను కనిపిస్తాడు.

ఇతడు మహిమాన్వితుడైన మంత్రద్రష్టగా కీర్తిని పొందాడు. చాలామంత్రాలను సాక్షాత్కరించుకొన్నవాడు. ఋగ్వేదం లోని ఐదు, ఎనిమిది, తొమ్మిదవ మండలాల్లో అనేక సూక్తాల్ని దర్శించాడు. అథర్వవేదంలోను, శతపథబ్రాహ్మణంలోను, బృహద్దేవతలోను, శాంఖాయనశ్రౌతసూత్రంలోను, తైత్తిరీయ ఆరణ్యకంలోను, శ్యావాశ్వుడు మంత్రాల్ని దర్శించాడు. పంచవింశ బ్రాహ్మణంలో శ్యావాశ్వుడు 'సామ మంత్రద్రష్టగా' పేర్కొనబడ్డాడు.

**అర్చనానసుని ఆశ్రమం-**

అది గంగాసింధు మైదానప్రాంతం. ఆ ప్రాంతాన్ని

ఆర్యావర్తమంటారు. ఆ ప్రదేశంలో పుణ్యనదులున్నాయి. పవిత్ర పర్వతాలున్నాయి. అక్కడక్కడ ఆకాశంలోని మేఘాలగుంపులా ఆశ్రమాలున్నాయి. వాటిలో అత్రిమహర్షి ఆశ్రమం ఒకటి. అక్కడే అత్రి పుత్రుడు అర్చనానసుని ఆశ్రమం. ఆ సమీపంలోనే అత్రిమనుమడు, అర్చనానసుని కుమారుడైన 'శ్యావాశ్వని' పర్ణశాల.

ఆ ఆశ్రమం విశ్వవిఖ్యాతం. అక్కడికి దగ్గర్లోనే మునివాటికలున్నాయి. అక్కడ వేదాధ్యయనం నిరంతరం సాగుతూవుంది. శాస్త్రచర్చలు జరుగుతున్నాయి. అక్కడి జంతువుల మధ్య వైరభావం లేదు. క్రూరజంతువులు సాధుజంతువులతో అన్యోన్యంగా మెలగుతున్నాయి. మునికుమారుల మధ్య భేదభావం లేదు. ఎక్కడ చూచినా పవిత్రవాతావరణం. ఎక్కడ చూచినా మనోహ్లాద కారణమయిన ప్రకృతి దృశ్యాలే. కళ్ళకు ఆనందం, చెవులకు ఇంపు, మనసుకు ఉల్లాసం కలిగించేలా ఆశ్రమవాతావరణం ఉంది. ఆ ఆశ్రమం అతిథులకు స్వాగతం పలుకుతూవుంది. తమ ఆతిథ్యంతో మురిపింపచేస్తుంది.

ఇలాంటి వైశిష్ట్యం కలిగిన ఆ ఆశ్రమంవైపు ఒక రథం కదులుతూ వుంది. ఆరథగమనం స్థితప్రజ్ఞునిలా వుంది. రథచ్ఛత్రానికున్న గంటలు ఆశ్రమం దగ్గరపడిందని మృదునాదంతో హెచ్చరిస్తూ వున్నాయి. రథానికి కట్టిన గుఱ్ఱాలు మహారాజు కీర్తిలా ప్రకాశిస్తున్నాయి. ఆరథంలో విద్యావినయ సంపన్నుడు రాజర్షి రథవీతి కూర్చున్నాడు. ఆ రథం ఆశ్రమప్రాంతం చేరుకొంది. మహారాజు రథం దిగాడు. గుఱ్ఱాలను సేదతీర్చమని సారథిని ఆజ్ఞాపించాడు. తాను పాదచారిగా ఆశ్రమంలో అడుగుపెట్టాడు. అర్చనానసుని వాటిక చేరుకొన్నాడు. అపుడే ఆశ్రమం బయటికి వచ్చిన అర్చనానసుడు రథవీతిని చూచాడు. అతని సౌశీల్యతకు ఆనందించాడు. తను రాజయినా ఆశ్రమప్రాంతక్షేమం పట్టించుకొనే

ఔదార్యాన్ని మనసులో తలచుకొన్నాడు. యాగాదులు ఆటంకాలు లేకుండా కనురెప్పలో కాపాడే మహారాజు మంచితనాన్ని మెచ్చుకొన్నాడు. రాకరాక వచ్చిన రాజర్షి రథవీతికి అర్చనానసుడు అర్ఘ్య పాద్య మధుపర్కాలను ఇచ్చి అతిథిని గౌరవించాడు. రాజు సేదతీరాక తపోవన ఆగమనకారణం అడిగాడు.

''మహర్షీ! నేను చాలకాలం రాజ్యపాలనచేశాను. అంగరంగభోగాలు అనుభవించాను. సామంతుల జయజయధ్వానాలు విన్నాను. చక్రవర్తుల సాష్టాంగ నమస్కారాలను అందుకొన్నాను. ప్రజారంజకుడని కిన్నరులు కీర్తిస్తుంటే విన్నాను. నా కోరికలన్నీ తీరాయి. నాకు సుగుణవతి అయిన ఇల్లాలు ఉన్నది. అందానికి అందమయిన కుమార్తె ఉంది. అయినా ఒక కోరిక మాత్రం తీరలేదు'' అన్నాడు.

'మహారాజా! మీ కోరిక ఏమిటో సెలవీయండి. పాలకుల మనస్తాపాలను తీర్చడం మహర్షుల కర్తవ్యం. శాస్త్రమర్యాదలు చెప్పడం మా విధి. ప్రత్యామ్నాయం సూచించడం మా బాధ్యత చెప్పండి' అన్నాడు అర్చనానసుడు.

'మహర్షీ! నేను విశ్వవిఖ్యాతమైన యాగం చేయదలచుకొన్నాను. ఈ యాగానికి మీరు ఋత్విజులుగా వేంచేయాలి. మీరే హోతలై దీనిని నడిపించాలి. మీ పుత్రగణంతో, శిష్యగణంతో ఈ యాగానికై విచ్చేయాలి. ఇదే నా కోరిక'.

'అలాగే! సత్కార్యనిర్వహణలో మా ఆశీస్సులు ఎపుడూ ఉంటాయి. యాగ సన్నాహం చేయండి. సంభారాలను సంగ్రహించండి. నేను నా పుత్రులతో, క్రమాంత, జటాంత, ఘనాంత, లక్షణాంత వేదపాఠకులతో, యాగ రహస్య మర్మ కోవిదులతో విచ్చేస్తాను' అన్నాడు.

దర్భనగరోపకంఠంలో విశిష్టయాగం -

అది రథవీతి పట్టణ ప్రాంగణం. ఆ నగరం పొలిమేరలోనే పవిత్ర గోమతీనది పారుతూవుంది. అక్కడి ఉద్యానవనాలు పూలతో తమ సంతోషాన్ని ప్రకటిస్తున్నాయి. ఎత్తయిన వృక్షాలు రాజు సుస్థిరకీర్తిని చాటుతున్నాయి. అక్కడే హోమకుండాలున్నాయి. ఋత్విక్కులు వ్రతనిష్ఠులై ఉన్నారు. యాగ సంభారమంతా చుట్టూ ఉంది.

'అరణి' సిద్ధమయింది. దేవతాహ్వానం మొదలయింది.

అగ్ని ప్రజ్వరిల్లింది. హవిస్సులు యాగకుండంలో సమర్పింపబడుతున్నాయి. వేదమంత్రాలు సస్వరంగా సుస్వరంగా వినబడుతున్నాయి. ఈ వాతావరణానికి పరవశించినవారు కొందరు. రాజు నిష్ఠకు మెచ్చుకొన్నవారు కొందరు. మనకోసమే కదా! అని మనసారా అభినందించినవారు కొందరు.

ఆ యాగప్రాంగణంలో ఎందరో వృద్ధులున్నారు. యువకిశోరాలున్నారు. శాస్త్రజ్ఞులున్నారు. వారి మధ్య ఒక దివ్యమూర్తి ఉదయభానునిలా ప్రకాశిస్తూ ఉన్నాడు.

అతనిలో ఆర్షతేజం ఉట్టిపడుతూ వుంది. అతని దివ్యదేహం తప్తకాంచనంలా ప్రకాశిస్తూ వుంది. అతని స్వరం జలదగంభీరంగా మ్రోగుతూ వుంది. అతడే అత్రిమహర్షి మనుమడు. అర్చనానసుని అనురాగం పంచుకొన్న కుమారుడు 'శ్యావాశ్వుడు'.

ఆ యాగానికి వచ్చిన వారిలో రాజులున్నారు. తపోవరిష్ఠులున్నారు. గృహస్థులున్నారు. కన్యకామణులున్నారు. వారిలో ఒక అమ్మాయి రథవీతి గారాబాల బిడ్డ. ఆమెలో క్షత్రియతేజం వుంది. విద్యావిభవం ఉంది. వినయ సంపత్తి ఉంది. అంతేకాదు యౌవనవికాసం

ఉంది. ఆమె రాకతో యాగమంటపంలో కొత్తకళ వచ్చింది. ఆమె రాకను గుర్తించి తప్పుకొన్నవారు కొందరు యాగవేదికవైపు దారులు తీసినవారు కొందరు. పరిచర్యకోసం సిద్ధంగా నిలుచున్నవారు కొందరు. కాని ఆ అందాలచందమామ అవేమీ పట్టించుకోలేదు. ఆమెలో నిష్ఠ ఉంది పవిత్రత ఉంది. యాగసందర్శనకుతూహలం ఉంది. ఆమె వేసవినదిలా వచ్చింది. యాగవేదికదగ్గర కూర్చొంది.

**అగ్నిసాక్షిగా అవలోకనం -**

అర్చనానసుడు సమంత్రకంగా హోమం చేస్తూ ఉన్నాడు. అకస్మాత్తుగా అతని చూపులు రథవీతి కుమార్తె వైపు మళ్ళాయి. ఆమె సౌందర్యస్వరూపిణిగా కనిపించింది. శ్రద్ధామూర్తిగా గోచరించింది. ఆమెలో ఏకాగ్రత ఉంది. జిజ్ఞాసవుంది. ఆమెనే చూస్తూ ఉండిపోయాడు అర్చనానసుడు. అపుడు దగ్గరలో వున్న 'శ్యావాశ్వుడు' తండ్రిని చూశాడు. ఏ మాత్రం కలవరం లేకుండా యాగవిధులను నిర్వహించే తండ్రిలో ఏమిటీ ఈ వింత పరిణామం అనుకొన్నాడు అయినా తమాయించుకొని తండ్రి వైపు తిరిగి చూశాడు. తండ్రి చూపు వెంబడి తానూ కళ్ళతో కదిలాడు. అతనికి అసమాన సౌందర్యరాశియైన రాజకుమార్తె కనబడింది. ఆమె యాగానురక్త అని తెలుసు. గతంలో చాలసార్లు ఆమె హోమాదులు జరిగేచోటకు రావడం గుర్తుకు వచ్చింది. కాని అప్పట్లో అతనిలో చలనం లేదు. కాని ఏదో తెలియని ప్రకంపనలు కలుగుతూనే ఉన్నాయి. రాజకుమార్తెలోను మార్పు కనిపించింది. దైవీకళ ఉట్టిపడుతూవుంది. సౌందర్యం రూపం దాల్చిందా అనే భావన కలిగింది.

అతని మనసు మనసులో లేదు. అతని చూపులు ఆమె ముఖానికి ప్రదక్షిణం చేస్తున్నాయి. తండ్రీ కొడుకులు రాజకుమార్తెను

చూస్తున్న వారి చూపుల్లో తేడావుంది. తండ్రి చూపుల్లో కోరిక లేదు. ఆ వీక్షణంలో అల్పవాంఛలు లేవు. ఆ దృష్టిలో ఆనందముంది. ఆతనిలో సంతృప్తి వుంది. తన కుమారునికి తగిన ' ఇల్లాలు' అనే భావన వుంది. తన కోడలిగా చేసుకోవాలనే తపన ఉంది. కొడుకు చూపుల్లో 'కోరిక' ఉంది. ఆ వీక్షణంలో ఆశాపరంపరలున్నాయి. ఆ దృష్టిలో తపన ఉంది. తన భార్యగా చేసుకోవాలనే అభిలాష ఉంది.

అయినా తండ్రీ కొడుకులు తేరుకొన్నారు. తమ విధ్యుక్త ధర్మం గుర్తుకు తెచ్చుకొన్నారు. యాగ నిర్వహణ పట్ల బుద్ధిని మరల్చారు. యాగాన్ని కొనసాగించారు. పూర్ణాహుతి పూర్తయింది. అవభృథ స్నానంతో యాగం ముగిసింది. మహారాజు రథవీతి ఆనందానికి అవధుల్లేవు. సవినయంగా శ్యావాశ్వ - అర్చనానసుల దగ్గరికి వచ్చాడు.

'మునీంద్రులారా! నా కోరికను మన్నించి నా పట్టణానికి విచ్చేశారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా యాగం పరిసమాప్తి అయింది. మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను. నా కృతజ్ఞతలు అందుకోండి. అన్నీ పూర్తి అయ్యాయి కాని మిగిలింది ఒకటే. మీ కోరికను తీర్చడమే. దయతో సెలవీయండి' అన్నాడు.

'మహారాజా! నేను పెద్దవాణ్ణి. నా కుమారుడు చిన్నవాడు. కోరికలు కోరడంలో చిన్నవారికే ప్రాధాన్యమివ్వడం మర్యాద, ఉచితం కూడ. అందుకే శ్యావాశ్వుడు కోరడం ధర్మం' అన్నాడు. రథవీతి అత్రి మనుమని వైపు చూశాడు.

శ్యావాశ్వుడు కొంచెం సిగ్గుపడుతూ 'మహారాజా! నా కోరిక వింటే మీరు బాధపడతారేమో' అన్నాడు. 'మునివర్యా! నేను బాధపడను. మీ కోరిక ఎలాంటిదయినా కాదనకుండా తీర్చడం నా విధి. నా సంకల్పం

నెరవేరినందుకు ప్రత్యమ్నాయంగా, కోరికలు తీర్చడం నా ధర్మం. మాట తప్పడం మా వంశంలోనే లేదు' అన్నాడు.

'ఇదొక శుభకార్యం. ఈ శుభకార్య సందర్భంలో సర్వశోభనవంయిన కోరికనే కోరుతున్నా. మీ చిన్నారిని నా సహధర్మచారిణిగా ఏలుకోవాలని వుంది'' అన్నాడు మెల్లగా శ్యావాశ్వుడు.

అర్చనానసుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. రాజు వైపుకు తిరిగి 'మహారాజా! నా సంకల్పం కూడ ఇదే. యాగసమయంలో మీ సుపుత్రిని చూశాను. ఆమె అద్వితీయ సౌందర్యానికి ముగ్ధుణ్ణి అయ్యాను. ఆమె వినయసంపత్తి నన్నెంతో ఆకర్షించింది. ఏ నాటికయినా అలాంటి అమ్మాయి మా అత్రికుటుంబం కోడలు కావాలని వుంది' అన్నాడు.

రథవీతి తండ్రి, తనయుల కోర్కెలతో నిరుత్తరు డయ్యాడు. మరొక ప్రక్క సంతోషం కూడ. పవిత్ర యాగం చేశాక, మాట తప్పనని చెప్పాక కాదనడం ధర్మం కాదనిపించింది. అందుచేత -

'మునివర్యులారా! నేను కాదనను, నాకు చాల సంతోషమే. వేద విద్వాంసుడు, తపస్సంపన్నుడయిన ఒక ముని నాకు అల్లుడిగా రావడం మహత్ భాగ్యమే. అదిగాక ఋషి కుటుంబంతో వియ్యమందడం ఆచారం కూడ. గతంలో చ్యవన, కక్షీవాన్, విమదలు కూడ రాజవంశజుల్నే భార్యలుగా స్వీకరించారు. అయితే ఒక మనవి. నేను రాజును కావచ్చు. కాని గృహస్థుణ్ణి. నేను రాజ్యం దానం చేయవచ్చు. కాని కుటుంబ విషయంలో భార్యను అడగడం ధర్మం. ఆమె నా అర్ధాంగి. ఈమెకు తల్లి. పెళ్ళి విషయంలో ఆమె అంగీకారం తీసుకోవడం యుక్తం. అందుచేత నాకు వ్యవధి ఇవ్వండి' అని కోరాడు.

''రాజర్షీ! నీవు చెప్పింది నరే! కుమార్తెల పెళ్ళివ్యవహారంలో తల్లి

సలహాలు తీసుకోవడం సబబే'', అన్నాడు అర్చనానసుడు.

పట్టమహిషి పట్టుదల -

రథవీతి అంతఃపురం వైపు కదిలాడు. మహారాజు రావడంతో చెలికత్తెలు తబ్బిబ్బుపడ్డారు. పలుదిక్కులా తప్పుకొన్నారు. మహారాజు ఆగమనాన్ని మహారాణికి తెలియజేశారు. రాజు రాణి ఏకాంతమందిరం చేరుకొన్నాడు. రాణి రాజుకు ఉచితోపచారాలు చేసింది.

''మహారాణీ! నా మాటలు సావధానంగా విను. అత్రి కుటుంబీకులు మనతో వియ్యమందడానికి ఉత్సాహం చూపుతున్నారు. అర్చనానసుడు మన కూతురిని తనకోడలుగా చేసుకోవాలని ఉబలాట పడుతున్నాడు.''

''అత్రికుటుంబీకులా! ఎవరూ! నాకు గుర్తుకు రాలేదే'' ప్రశ్నించింది రాణి. ''వారే'' మన యాగ నిర్వాహకులైన అర్చనానస మహర్షులు. అతని పుత్రుడే చిరంజీవి శ్యావాశ్వుడు.'' అన్నాడు. 'అసంభవం' అంది మహారాణి. ''ఎందుకూ? శ్యావాశ్వుడు సలక్షణంగా ఉన్నాడు కదా! వేద విద్వాంసుడు రూపయౌవన సంపన్నుడు కూడ కదా!'' ''కావచ్చు. నేను రాజర్షి కుమార్తెను. మీరూ రాజర్షులు. మన కుమార్తెను------'' 'ఏం వారు ఋషులు కాదా! పండితులు కాదా! శాస్త్రజ్ఞులే కదా! అదిగాక సౌమ్యులే కదా! జవాబిచ్చాడు రాజు. 'కావచ్చు.' కాని ఋషులందరూ మంత్ర ద్రష్ట కాజాలరు. శ్యావాశ్వుడు మంత్రద్రష్టకాడు'. తృణీకారంతో బదులిచ్చింది రాణి. 'అందరూ మంత్ర ద్రష్టలవుతారా? మంత్రద్రష్టలు మనసా వాచా కర్మణా బలవంతులయి ఉండాలి. కాని నాకు తెలిసినంతవరకు అతనిలో లోపం లేదు. అత్రి మంత్రద్రష్టకాడా! అతని కుమారుడు అర్చనానసుడు మంత్రద్రష్ట కాడా! ఇంకేమి కావాలి.''

'కావచ్చు. తాతల తండ్రుల జ్ఞానం పరిపూర్ణంగా మనుమనికి సంక్రమించవలెనని ఎక్కడా లేదు. అంతేగాకుండా తాతల, తండ్రుల జ్ఞానంతో బతికేవాడు మధ్యముడు. మంత్రద్రష్టయే నా అల్లుడు కావాలి. ఇదే నా కోరిక. ఇందుకు భిన్నమయిన ఏ వరుణ్ణి నేను అల్లునిగా స్వీకరించలేను'' అని నిక్కచ్చిగా చెప్పింది.

'అంతేకాదు. నా కూతురు వేదమాతగా ఉండాలి. ఆమెభర్త మంత్రద్రష్టయైన ఋషియై ఉండాలి!' అని కూడా అన్నది. '' ఒక వేళ శ్యావాశ్వుడు మంత్రద్రష్ట అయితే'' 'నాకు పరిపూర్ణసమ్మతమే. అతణ్ణే తప్పక అల్లునిగా చేసుకొంటాను' అంది. రాజు జవాబు చెప్పలేదు. అర్చనానసుని దగ్గరికి వెళ్ళాడు రథవీతి మహారాజు. నమస్కరించాడు. 'మహారాణి సమ్మతించారా!' కుతుహలంతో అర్చనానసుడు అడిగాడు. 'లేదు. మంత్రద్రష్ట అయిన అల్లుడు కావాలని ఆమె కోరిక.

'మహారాజా! విచారించకండి. నా కుమారుడు సామాన్యుడు కాడు. అతను తప్పక మంత్రద్రష్ట అవుతాడు. అపుడే వియ్యమందుకుందాం! అని ఆశ్రమం వైపు కదిలారు. వారు నడుస్తున్నారు. కాని మనసులు వేదనలతో మగ్గుతున్నాయి. చూపులు బాటల్ని చూస్తున్నాయి కాని అంతర్మథనం సాగుతూ ఉంది.

అరణ్యమార్గంలో అర్చనానస శ్యావాశ్వులు నడిచి వెళ్తున్నారు. యాగం పరిపూర్తి చేశామనే సంతోషం ఉన్నా ఏదో తెలియని వ్యథవారిని పీడిస్తూ వుంది. అర్చనానసుడు కొడుకువైపు చూశాడు.

అతని ముఖంలో కాంతి లేదు. ఏదో తెలియని దైన్యం అతనిలో కనిపిస్తూవుంది. ఎంత నిబ్బరంగా ఉన్నా బాధతో అడుగులు వేయడం స్పష్టమవుతూనే ఉంది.

పుణ్యరాజర్షిదంపతుల పునీతదర్శనం -

తండ్రీకొడుకులు నడిచి వెళ్తుంటే మార్గమధ్యంలో ఒక దంపతులు తటస్థపడ్డారు. కాని వారెవరో అర్చనానసునికి గుర్తుకు రాలేదు. వారితో పరిచయం చేసుకోవాలనే తపన క్షణం క్షణం ఎక్కువవుతూనే ఉంది.

ఆ దంపతులు తండ్రీకొడుకులకు ఎదురయ్యారు. ''మహాత్ములారా! మీరెవరో మాకు తెలియదు. కాని మీలో విశిష్టమైన తేజస్సు ప్రకాశిస్తూ వుంది. మిమ్మల్ని చూస్తుంటే నమస్కరించాలనిపిస్తోంది. నేను అర్చనానసుణ్ణి. వీడు నాకుమారుడు'' అని పరిచయం చేశాడు.

''ఓహో! మీరేనా అర్చనానసులు. రథవీతి యాగనిర్వాహకులు మీరేనా! మీరు సుప్రసిద్ధులు కదా! లోగడ మీ గురించి మీ బ్రహ్మతత్త్వ జిజ్ఞాసను గురించి ఎంతో విన్నాం. మిమ్మల్ని కలుసుకోవడంతో మా జీవితం ధన్యమైంది. నేను తరంతుణ్ణి. వీడు నా సోదరుడు పురుమీడుడు, ఈవిడ శశీయసి.''

పరస్పరం పరిచయం చేసుకొన్నారు. శ్యావాశ్వుడు శశీయసి పాదాలకు పునఃప్రణామం చేశాడు. ఆ చిరంజీవిని చూసి శశీయసి 'శుభమస్తు'' అని ఆశీర్వదించింది. ఆవుల్ని, గుర్రాల్ని శ్యావాశ్వునికి ప్రీతితో బహూకరించింది.

పురుమీడుడు శ్యావాశ్వుని వినయసంపత్తికి హర్షించాడు. 'నీవు లోకోత్తర ప్రఖ్యాతిని పొందుతావు'' అని ఆశీర్వదించాడు. శుభసూచకంగా గోదానం చేశాడు.

వేసవి తీవ్రత కారణంగా వారు ఒక చెట్టునీడలో విశ్రమించారు.

వారిమధ్య వేదాంతచర్చ కొనసాగుతూ ఉంది. మాటల సందర్భంలో మరుత్తుల ప్రస్తావన వచ్చింది. మరుద్గణసేవనం వల్లనే తామింత వాళ్ళమయ్యామని ఆ రాజర్షిదంపతులు చెప్పారు.

అపుడు శ్యావాశ్వుడు మరుత్తుల మహిమల్ని చెప్పవలసినదిగా కోరాడు. రాజదంపతులు సంతోషంతో ఇలా చెప్పారు. ''శ్యావాశ్వా! దేవతాగణంలో ఇంద్రుని తరువాత మరుత్తులకే ప్రాధాన్యముంది. మరుత్తులు పృష్ణిరుద్రుల సంతానం. వారు వాయుపుత్రులు. స్వర్గవాసులు. స్వయంజాతులు కూడా. వీరందరూ ఒకే వయస్సు, ఒకే శక్తి, ఒకే మనసుకల సోదరులు. వారిలో ఏ ఒక్కరూ ఏ ఒక్కరికంటె పెద్దగాని చిన్నగాని కారు. వీరు భూమి అంతరిక్షాలలో పెరిగారు. రోదసి వీరి భార్య. ఇంద్రాణి, సరస్వతి వీరి స్నేహితురాళ్ళు.

మరుత్తులు అగ్నిలా ఎఱ్ఱగా బంగారు రంగుతో మెరుస్తూ వుంటారు. మెరుపులే కళ్ళుగా ప్రకాశిస్తారు. బంగారు గొడ్డళ్ళే వీరి ఆయుధాలు. వీరు పుష్పాలను బంగారు ఉత్తరీయాలను, ఆభరణాలను, కిరీటాలను, భుజకీర్తుల్ని, కడియాల్ని ధరిస్తారు. పృషతులనే ఎఱ్ఱటి ఆడ గుఱ్ఱాల మెరుపు రథాల్లో సంచరిస్తారు. వారు అభిముఖులూ, విముఖులూ, ప్రతికూలురూ, అనుకూలురూ చలించే స్వభావం కలవారు.

మరుత్తులు సుందరులు. యువకులు. పరిశుభ్ర ఆకారం కలవారు. సింహాలలాగా క్రూరస్వభావం కలవారు కూడ. అయినా సహజంగా పిల్లల్లాగే వుంటారు. వీరి మాట పిడుగులాంటిది. వీరు అవలీలగా పర్వతాల్ని పెకలిస్తారు. అలవోకగా అడవుల్ని, అరణ్యంలోని జంతుజాలాన్ని సర్వనాశనం చేయగలరు.

మరుత్తులు సామాన్యులు కారు సుమా! వారు ఋత్విక్కులు. ఇంద్రుడు అహిశంబరుల్ని సంహరించే వేళ గానం చేశారు. వీరు ఇంద్రునికి ప్రియమయిన స్నేహితులు. ఇంద్రునితో కలవనప్పుడు క్రౌర్యంతో సంచరిస్తారు. తమ తండ్రిలాగే భక్తులకు ఔషధాలను ప్రసాదిస్తారు.

శ్యావాశ్వ! మరుత్తులు పరుష్ణీ నదిలో వాసంచేసేవారయినా కొన్ని వేళల్లో చోరుల్లా ఉంటారు. వారి వునికిని పసిగట్టడం చాలా కష్టం. అయినా సంరక్షణ శీలురనడం గుర్తుంచుకో. మర్త్యవాసుల్ని పాపాలనుండి తప్పించే సాధుస్వభావం వారిది. ఇతర దేవతల్ని స్తుతించకుండా మరుత్తుల్ని సంస్తవం చేసేవారికి ఆ మరుద్గణం సమస్త వస్తు వితతిని ప్రదానం చేస్తుంది. అందుచేత శ్యావాశ్వా! మరుత్తుల్ని నిష్ఠతో సేవించు. ఆ మరుద్గణం నీవు కోరిన కోరికను తప్పక తీరుస్తుంది. మరుద్గణాన్ని హవిస్సులతో అర్చించి మరుద్గణ సమీపంలో ఆదిత్యునిలా వెళ్ళు'' అని హితోపదేశం చేసారు.

తరంత శశీయసీ పుణ్యమూర్తుల దర్శనంతో, వారి ఉపదేశంతో తాను కూడ మంత్రద్రష్టగా ప్రసిద్ధి పొందాలని సంకల్పించుకొన్నాడు శ్యావాశ్వుడు.

ఆశ్రమం చేరుకొన్నా శ్యావాశ్వుని మనస్సు మనస్సులో లేదు. అతని చూపంతా నగరంవైపే ఉంది. అతని ఆలోచనలన్నీ రాజకుమార్తె చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. అతనిలో ప్రేమ అంకురించింది. విరహం విస్తరించింది.

అతనిలోని కవితాహృదయం మేల్కొంది. తనప్రేయసిని ఊహించుకుంటూ పాటలు పాడడం మొదలుపెట్టాడు.

ఆశ్రమంలోని ప్రశాంత వాతావరణం అతని మనస్సును రంజించడం లేదు. అంతా అతనికి విపరీతంగా తోస్తూ ఉంది. వేదధ్వని

అతని హృదయంలో కలిగే ప్రేమసంగీతాన్ని నిలువరించలేకపోతూ వుంది. అతనికి ప్రపంచమంతా రమణీయంగా కనిపిస్తూవుంది.

అతని తీవ్ర ప్రేమాసక్తి అతని మానసికస్థైర్యాన్ని క్రుంగదీస్తూ వుంది. ఆ రాజకుమార్తెను స్మరించకూడదని ఎంత తన మనస్సును అదుపులో పెట్టుకోవాలని ప్రయత్నించినా విఫలమయింది. చివరకు అతను రాజకుమారి లేకుండా తను బ్రతుకలేదని నిశ్చయించుకొన్నాడు. ఆమెలేక తనకు శాంతిలేదు. ఆమెలేక తనకు ఆనందం లేదు. ఆమెలేక జీవితం లేదు. అటువంటి సుకుమారి లేకుండా తాను ఈ ప్రపంచంలో ఒంటరివాడుగా జీవించడం వ్యర్థమని తలంచాడు.

శ్యావాశ్వుడు ఆలోచించాడు. ''తానెందుకు ఇంతగా ప్రాకృతమానవునిలా మారిపోవాలి ? మహారాణి కోరికలో తప్పేమీ లేదు. మహారాజు వెనకడుగువేయడంలో దోషం లేదు. ఎవరయినా తన అల్లుడు ఉదాత్తుడు కావాలని, ఉన్నతుడు కావాలని కోరుకోవడం లేదా! కోరుకొంటారు కదా! అలాగే నేను మంత్రద్రష్ట కావడంలో ఎలాంటి భేషజం లేదు. అందుచేత, 'నేను తపస్సు చేస్తాను, మంత్రద్రష్ట అవుతాను' అని సంకల్పించుకొని అరణ్యం వైపు మరలి తరంత శశీయసులు సూచించినవిధంగా కఠిన తపస్సు చేశాడు. దేవతలు సాక్షాత్కరించారు.

''శ్యావాశ్వ! నీనిష్ఠను గుర్తించాము. నీ కోరిక నెరవేరాలంటే నీవు మరుద్గణాన్ని సేవించు. నీ కోరికనెరవేరుతుంది'' అన్నారు. తరంత శశీయసులు కూడ ఈ మాటే చెప్పడాన్ని శ్యావాశ్వుడు గుర్తుకు తెచ్చుకొన్నాడు. నియమనిష్ఠలతో మరుద్గణాన్ని స్తుతించాడు.

మంత్రద్రష్ట - '' ఆత్రేయ శ్యావాశ్వమహర్షి''

''ఓ మరుత్తులారా ! మీరు ఇంద్రసఖులు. బలసంపన్నులు.

లోకక్షేమంకరులు. బాధలు కలిగే వేళ ప్రజలు రాజుల సన్నిధికి పోయే విధంగా నేను మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. మీరు వృషభసంయుక్త గోగణంలా ఉన్నారు. వైరిగణాన్ని తరిమి తరిమి కొట్టినట్లు జలద మేఘాలను చెల్లాచెదరు చేస్తున్నారు.''

'ఓ పృష్ణి పుత్రులారా! మీరు కదిలితే భూమికూడా కదలుతుంది. వణకిపోతుంది. మీరు యమజులలాగా మనోహరరూపం ధరించండి. ఆకాశంలాగా విస్తరించండి. అక్షయధన ప్రదాతలుకండి. అమలజన్ములుగా అలంకార శోభితులుగా దర్శనభాగ్యం కలిగించండి.''

''ఓ రుద్రపుత్రుల్లారా! తుష్టి, పుష్టిరెండూ వున్న ధనుర్బాణాలు మీకున్నాయి. అశ్వరథాలున్నాయి. ప్రదీప్త అస్త్రాలున్నాయి. నన్ను సంప్రీతుణ్ణేచేయండి.''

''ఓ మరుత్తులారా! భర్త ఏవిధంగా భార్యకు తన అనంత వీర్య సంపత్తితో గర్భాన్ని కలిగిస్తాడో అలాగే మీరు భూమికి జలగర్భం ప్రసాదించండి. మీరు సముద్రంలో నావలాగా కదలిపోతున్నారు. మీ గమనం చిత్రం. మీరు ఆవుకొమ్ములలాగా కిరీటాన్ని ధరించండి. గుర్రం లాగ వేగంగాను, మనోహరంగాను కదలండి. యజమాని లాగా శుభం'' ప్రసాదించండి.

''ఓ మరుత్తులారా! పూజ్యులైన మిమ్మల్ని పూజించటానికి ఎవరు సమర్థులు? యోగ్యానుసారంగా మీకు స్తోత్రాల్ని వినిపించేవారెవ్వరు?''

శ్యావాశ్వుని శ్రద్ధా భక్తి పూర్వకమైన స్తోత్రాలను విని మరుత్తులు ప్రసన్నులయ్యారు. సంతోషంతో దివ్యవాహనాన్ని అతనికి బహూకరించి అంతర్ధానమయ్యారు. ఆదివ్యవిమానాన్ని ఎక్కి పయనం సాగించాడు శ్యావాశ్వుడు.

మరుత్ గణాల ఆశీర్వాదబలంతో శ్యావాశ్వుడు ఋషిత్వాన్ని పొందాడు. మంత్రద్రష్ట అయ్యాడు. అదేసమయంలో అతనికి రాజకుమార్తె మనసులో మెదిలింది. ఎవరికోసం, ఎందుకోసం ఈ కఠోర తపస్సు చేశాడో, మంత్రద్రష్ట అయ్యాడో అలాంటి అపురూప సౌందర్యరాశి అయిన ఆ రాజకుమార్తెను సహధర్మచారిణిగా చేసుకోవడానికి మనసు తహతహలాడింది.

రాజ్యం వైపు ప్రయాణం సాగించాడు. రాజు మాట తప్పడనే విశ్వాసం అతనిలో ఏర్పడింది. హసన్ముఖి అయిన రాజకుమార్తె కళ్ళల్లో కదులుతూ వుంది.

శ్యావాశ్వుడు అలానడిచి వెళ్తున్నాడు. రాజ్యసమీపానికి వచ్చినట్లు భావించాడు కాని ఇంకా గమ్యం చాలా దూరంలో ఉంది. తాను మంత్రద్రష్ట అయినట్లు చెప్పాలని ఆరాటం. కాని తనగొప్పతనాన్ని తానే చెప్పుకోకూడదు కదా! ఆత్మప్రశంస చేసుకోకూడదని ఒక్కమారు అనుకొన్నాడు. ఈ వార్తను ఒక దూత ద్వారా రథవీతికి తెలియజేయడం ఉత్తమమని భావించాడు. అదే దూతద్వారా రథవీతి మనోభావాన్ని తెలిసికోవాలని కూడ ఆశించాడు.

సఫలదౌత్యం -

ఈలోగా చీకటిపడింది. మార్గమంతా చీకటిమయంగా ఉంది. చిమ్మచీకటి. ఏమీ తెలియడం లేదు. అతనికి ఒక ఉపాయం తట్టింది. రాత్రికి అధిదేవత అయిన నిశాదేవిని దూతగా పంపవచ్చు కదా! యని, అనుకొన్నదే తడవుగా నిశాదేవిని స్తోత్రం చేశాడు. నిశాదేవి సంతోషించి ప్రసన్నురాలయింది.

'శ్యావాశ్వా!' నీ కోరిక ఏమిటి!'' అని అడిగింది.

''ఓ నిశాదేవీ! నీవు దూతగా వెళ్ళి రథవీతికి శ్యావాశ్వుడు మంత్రద్రష్ట అయ్యాడు' అనే సందేశాన్ని చేరవేయాలి.'' ''శ్యావాశ్వా! నీ దౌత్య కార్యాన్ని నేను నిర్వహిస్తాను. ఆ రథవీతి యొక్క రాజ్యమెక్కడ!'' అని అడిగింది.

''రథవీతి రాజ్యము గోమతీనదీతీరములో ఉంది'' అనగానే నిశాదేవి శీఘ్రగమనంతో కదిలింది. గోమతీనదీతీరానికి చేరుకుంది.

అక్కడ మహారాజును చూచింది. '' ఓ మహారాజా!'' అని పిలిచింది. రథవీతి ఆశ్చరచకితుడయ్యాడు. నలుదిక్కుల చూచాడు. మనిషి కనబడటం లేదు. కేవలం మాట మాత్రం వినబడుతుందేయని ఆలోచించాడు.

'ఓ రాజా! నేను నిశాదేవిని. మీరు నన్ను చూడలేరు. ఎందుకంటే అంధకారమే నా స్వరూపం'' అంది.

రాజు లేచి నిలబడి నలుదిక్కుల నున్న గాఢాంధకారాన్ని చూచి నమస్కరించాడు.

'అమ్మా! నిశాదేవి! నీకు వచ్చిన ఆపద ఏమిటి?' 'ఓ పృథ్వీపతీ! నీ రాజ్యంలో ఆపదలు లేవు. రావు. నేనొక శుభసందేశాన్ని నీకు తెలియజేయడం కోసం వచ్చాను'. 'అనుగ్రహించండి' అని అన్నాడు రాజు.

'' ఓ నృపవరా! నేను శ్యావాశ్వుని దూతగా వచ్చాను. '' ఈమాట వినగానే రాజు ఆశ్చర్యపోయాడు. 'అర్చనానుని కుమారుడు శ్యావాశ్వుడు మంత్రద్రష్ట అయ్యాడు' అని శుభసందేశాన్ని వినిపించింది. రాజు సంతోషించాడు. ''అమ్మా! ఏమి తమ ఆజ్ఞ? అని సవినయంగా అడిగాడు.

''ఓ రాజా! శ్యావాశ్వుడు తన కర్తవ్యపాలనలో సఫలుడయ్యాడు. ఇపుడు మీరు మీ మాటను నిలబెట్టుకోవలసిన సమయం ఆసన్నమైంది''.

తప్పకుండా! అని రాజు దృఢస్వరంతో సమాధానమిచ్చాడు. ఈ మాట వినగానే తన దౌత్యం ఫలించినందుకు నిశాదేవి సంతోషించింది.

తనరాణికి ఈ సంతోష వార్తను వెంటనే తెలియజేయాలని రాజు ఆరాటపడ్డాడు. రాణి అంతఃపురం వైపు అడుగులు వేశాడు. మహారాణిని చూచి. '' సాధ్వీమణీ! నీ కోరిక త్వరలో నెరవేరబోతూ ఉంది. 'శ్యావాశ్వుడు మంత్రద్రష్ట అయ్యాడు. నీకు ఇంక అభ్యంతరం లేదు కదా! నీవు అతనిని అల్లునిగా తప్పక స్వీకరిస్తావని నేను నమ్ముతున్నాను.'' అన్నాడు. రాణి హర్షంతో తన ఆమోదాన్ని తెలిపింది.

రథవీతి దంపతులు అర్చనానసుని ఆశ్రమం వైపు కదిలారు. ఆశ్రమాన్ని చేరుకొన్నారు. అర్చనానసుని పాదాలకు నమస్కరించారు. తన తల్లి వెనక రాజకుమార్తె సిగ్గుతో నిలిచి ఉంది. అర్చనానసుడు స్నేహంతో రాజును రాణిని కుశలమడిగాడు. తరువాత రాజకుమార్తెను క్షేమమడిగి తనకు కాబోయే కోడలిని మనసారా ఆశీర్వదించాడు. రాజకుమార్తె భక్తి శ్రద్ధలతో మహర్షి పాదములకు నమస్కరించింది.

రథవీతి కొంచెం సిగ్గుపడుతూ అర్చనానసుని చూచి ''ఓ మహాత్మా! మీరు నా కుమార్తెను కోడలిగా చేసుకొంటాను అని అడిగినపుడు నేను రాణి మాటలను విని అజ్ఞానంతో నిరాకరించాను. ఈ మూర్ఖుణ్ణి మన్నించండి,'' అని విన్నవించాడు.

అర్చనానసుడు '' ఓ రాజా! రాణి ఆకాంక్షవల్ల ఒక గొప్ప ప్రయోజనమే సిద్ధించింది. నా పుత్రుడు శ్యావాశ్వుడు మంత్రద్రష్ట అయ్యాడుకదా! క్షమించడమన్న ప్రశ్నకు ఇక్కడ చోటే లేదు'' అని చెప్పాడు.

రథవీతి నమస్కరిస్తూ, '' ఓ మహర్షీ! మీరు కోరుకొన్న కోడలు మీ సమక్షంలోనే నిలిచి ఉంది'' అన్నాడు.

అర్చనానసుడు '' ఓ రాజా! రూపవతి, శీలవతి, గుణవతియు అయిన నీ కూతుర్ని ఎవరు కోడలిగా చేసుకోరు?'' సంతోషం వ్యక్తం చేసాడు.

ఋషివరేణ్యునికి అర్ఘ్య పాద్య మధుపర్కాది సత్కారాలు రథవీతి చేశాడు. వివాహ సమయంలో సహస్ర గోసంపదను, ప్రశస్త అశ్వసమూహాన్ని ప్రదానం చేశాడు. శ్యావాశ్వుని సంతృప్తికి అంతేలేదు. తాను కోరిన తరుణీమణి తనదయినందుకు ఎంతగానో ఆనందించాడు. అడిగిన వరాలను ప్రసాదించే మరుద్దేవతలు తను కోరిన మానినీమణిని తనకు సహధర్మచారిణిగా అనుగ్రహించినందుకు ఉప్పొంగిపోయాడు.

రథవీతి, పట్టమహిషి, అర్చనానసులు అనంతమునిగణం ఆనందానికి హద్దులేకపోయింది. ఆశ్రమమంతా అతిలోకరమణీయంగా మారిపోయింది.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

● ● ●